

సమాచార శాఖ ఏడీగా గోవిందరాజులు

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సంచాలకునిగా పి.గోవిందరాజులు నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా డీపీఆర్వో కార్యాలయంలో పనిచేస్తున్నారు. గోవిందరాజులు గతంలో జిల్లాలో ఏపీఆర్వోగా, డివిజనల్ పీఆర్వోగా, ఇన్‌చార్జి డీపీఆర్వో పని చేశారు. తాజాగా ఇక్కడకు పదోన్నతిపై ఏడీగా వస్తున్నారు. త్వరలోనే బాధ్యతలను స్వీకరించనున్నారు.

విలువలతో కూడిన విద్యే లక్ష్యం

● మోతీమహల్ ప్రారంభోత్సవంలో మాన్సాస్ చైర్మన్, గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు

విజయనగరం/ రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమ పూర్వీకుల నుంచి విలువలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యంగా మాన్సాస్ విద్యా సంస్థలు పనిచేస్తున్నాయని మాన్సాస్ ట్రస్టు చైర్మన్, గోవా గవర్నర్ అశోక్‌గజపతిరాజు చెప్పారు. కోటలో మాన్సాస్ ఆధ్వర్యంలో రూ.12 కోట్ల 75 లక్షలతో పునఃనిర్మించిన మోతీమహల్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఇందులో నూతనంగా కంప్యూటర్ ల్యాబ్స్, 30 వరకూ అదనపు తరగతి గదులను నిర్మించారు. ఈ సందర్భంగా అశోక్‌గజపతి రాజు మాట్లాడుతూ, ఈ ప్రాంతంలో విద్యా వ్యాప్తి కోసం తమ పూర్వీకులు మాన్సాస్ విద్యా సంస్థలను స్థాపించారని గుర్తు చేశారు. ఇందులో చదువుకున్నవారు దేశంలోని ప్రముఖ స్థానాల్లో స్థిరపడి విద్యా సంస్థల ఖ్యాతిని ఇనుమడింప చేస్తున్నారన్నారు. కొత్త భవనాల్లోకి ఎంఆర్ కళాశాలను తరలిస్తున్నామని, అలాగే లా విద్యలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఎంఆర్ లా కళాశాలను ఎక్సలెన్సీగా తీర్చిదిద్దనున్నట్టు చెప్పారు. ఏ ప్రభుత్వమైతే విద్య, వైద్యానికి ప్రాధాన్యత ఇస్తుందో? ఆయా రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గతంలో పాలన సాగించిన ప్రభుత్వం సంస్కరణల పేరిట ప్రభుత్వ విద్యా సంస్థలను ఎత్తివేసిందన్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యారన్నారు. నీతి ఆయోగ్ నివేదిక ద్వారా 14లక్షలు మంది విద్యకు దూరమైనట్లు స్పష్టమైందన్నారు. తమ పూర్వీకులు ఏ లక్ష్యంతో మాన్సాస్ సంస్థలను స్థాపించారో ఆ లక్ష్యసాధనకు నిరంతరం కృషి జరుగుతుందని చెప్పారు.



దేవుళ్ల చిత్రపటాలతో కొత్త భవనంలోకి వెళ్తున్న గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, ఆయన సతీమణి సునీలా గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి



మోతీమహల్ వద్ద కుటుంబ సభ్యులతో అశోక్‌గజపతిరాజు

పీవీజీ రాజుకు నివాళి..

మోతీమహల్ ముందు ఉన్న పీవీజీ రాజు విగ్రహానికి మాన్సాస్ చైర్మన్, గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజు, ఆయన సతీమణి సునీలాగజపతిరాజు, గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, విజయనగరం ఎమ్మెల్యే అదితిగజపతిరాజు, అశోక్‌గజపతిరాజు సోదరి సునీతా ప్రసాద్, తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. కోటలోని మోతీమహల్‌లోనే తన విద్యాభ్యాసం సాగిందని సంధ్యారాణి గుర్తుచేశారు.

నెలలో ఎప్పుడైనా తీసుకోవచ్చు

● మరింత సులువుగా రేషన్
● ఇకపై నెలంతా పంపిణీకి ప్రభుత్వ నిర్ణయం
● అందుబాటులోకి ఇంకొన్ని సరుకులు
● డీలర్ల ఆదాయం పెంచేలా చర్యలు
● మార్కెట్‌లో సరుకుల ధరలకూ కళ్లెం





బొబ్బిలి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డుదారులకు ఊరట. చౌకధరల దుకాణాల పనివేళలపై ప్రభుత్వం తాజాగా కీలక ప్రకటన చేసింది. ఉచిత బియ్యం, ఇతర సరుకులను లబ్ధిదారులు ఇకపై ఎప్పుడైనా తీసుకోవచ్చని, ఇందుకోసం రేషన్ షాపులు నెలంతా తెరిచి ఉంచేలా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. 15 రోజులలోపే తీసుకోవాలనే కాలపరిమితిని తీసేస్తున్నట్లు స్పష్టత ఇచ్చింది. రేషన్ దుకాణాలు 365 రోజులూ తెరిచే ఉంటాయని, ప్రజలు తీరిక ఉన్న సమయంలో లేదా అవసరమైనప్పుడు సరుకులు తెచ్చుకునే వెసులుబాటు కల్పించింది. ఇప్పటి వరకు నెలలో 15 రోజులలోపు మాత్రమే రేషన్ తీసుకునే అవకాశం ఉండేది. ఆ సమయంలో తీసుకోనివారు (మిగతా 8వ పేజీలో..)

ఆదేశాలు రావాల్సి ఉంది

నెలంతా రేషన్ డిపోలను నడపాలన్నదానిపై మాకు ఎటువంటి ఆదేశాలు ఇంకా అందలేదు. బహుశా ఈ నెల నుంచే అమలు కావచ్చు. బొబ్బిలి పట్టణం, మండలంలో 35,285 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చర్యలు తీసుకున్నాం. పప్పుదినుసులు, వంటనూనె, గోధుమపిండి, మిల్లెట్స్ వంటి వాటికి డిమాండ్ ఉంది. వీటిని రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేస్తే వినియోగదారులకు చాలా ప్రయోజనకరం.

- రెడ్డి సాయికృష్ణ, సీఎస్‌డీటీ, బొబ్బిలి

ఆ కోళ్లకు ఏమైంది?

● ఒక్క ఫారంలో.. రెండు రోజుల్లో 38 వేల నాటుకోళ్లు మృతి
● ఇప్పటికే లక్షల సంఖ్యలో బ్రాయిలర్ కోళ్ల మృత్యువాత
● నివేదిక వచ్చే వరకు పెంచొద్దన్న పశుసంవర్ధకశాఖ



రామలింగపురంలో మృతిచెందిన నాటు కోళ్లు

కొత్తవలస, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కొత్తవలస ప్రాంతంలో కోళ్ల మృత్యువాత ఆగడం లేదు. ఇప్పటికే లక్షల సంఖ్యలో బ్రాయిలర్ కోళ్ల ప్రాణాలు కోల్పోయాయి. రెండు రోజుల వ్యవధిలో కేవలం ఒక్క ఫారంలోనే 38 వేల నాటుకోళ్లు మృతి చెందడంతో పెంపకందారు ఆందోళన చెందుతున్నాడు. కోళ్లకు సోకిన ఆ వ్యాధి ఏమిటో ఎవరికీ అంతుచిక్కడం లేదు.

బ్రాయిలర్ కోళ్ల మృత్యువాత పడి ఫారాలకు ఫారాలే ఖాళీ అయిపోయాయి. దీంతో వాటిని పెంచడం ద్వారా ఉపాధి పొందుతున్న రైతులు, హేచరీల నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. వ్యాధిని నిర్ధారించేందుకు కొత్తవలస పశు సంవర్ధకశాఖ అధికారులు నమూనాలను విజయవాడ ల్యాబ్‌కు పంపించారు. నివేదిక రావాల్సి ఉంది. అయితే బ్రాయిలర్ కోళ్లకు భిన్నంగా మండలంలోని రామలింగపురం గ్రామానికి చెందిన వి.రాంబాబు ప్రియాంక ఆగ్రో (మిగతా 8వ పేజీలో..)

వ్యర్థాలను తొలగించి నిప్పు పెట్టండి

కోళ్ల మృతిపై విజయవాడ ల్యాబ్‌కు నమూనాలు పంపించినప్పటికీ నివేదిక వచ్చినా మరణాలను ఇప్పట్లో ఆపడం సాధ్యం కాదు. నిపుణులు కూడా చేతులెత్తేసారు. ఇప్పట్లో కోళ్ల ఫారాల్లో కొత్తగా కోళ్లను తెచ్చి పెంచకపోవడమే మంచిది. ముందు కోళ్ల ఫారాలలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించి వాటికి నిప్పు పెట్టాలి. ఖాళీ చేసిన ఫారాల్లో షెడ్‌లను శుభ్రం చేయాలి. చనిపోయిన కోళ్లను పూడ్చి పెట్టాలి. వ్యాధి సోకిన కోళ్ల వ్యర్థాలను పొలాల్లో ఎరువు కింద కూడా వాడొద్దు. నివేదిక వచ్చాక ఏం చేయాలనే విషయాన్ని వివరిస్తాం.

కన్నంనాయుడు, ఏడీ, పశుసంవర్ధకశాఖ, కొత్తవలస

నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు

● ఏసీఆర్‌లో నెగెటివ్‌గా రాస్తా ● కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉంటే ఆ అధికారిపై చర్యలు తీసుకుంటామని, ఆన్యువల్ కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్ (ఏసీఆర్)లో నెగిటివ్‌గా రాస్తానని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ హెచ్చరించారు. పీజీఆర్ఎస్ నోడల్ అధికారులతో కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. అర్జీదారులు తమ సమస్యలు, బాధలు తీరుతాయనే పీజీ ఆర్ఎస్‌కు వస్తారని, వాటిని అర్థం చేసుకుని పరిష్కరించడమే నిజమైన సేవ అని చెప్పారు. దరఖాస్తుల్లో వాస్తవికత ఉంటే పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్జీలకు సమాధానాలు రాసేటప్పుడు స్పీకింగ్ ఆర్డర్ మాదిరి ఉండాలని, ఏది అడిగారో దానిపైనే సమాధానం రాయాలని సూచించారు. అర్జీలు పరిష్కారానికి ప్రతి కార్యాలయం నుంచి ఒక బాధ్యత గల ఉద్యోగిని ఎంపిక చేసి, వారి పేర్లను కలెక్టరేట్‌కు పంపాలన్నారు. సీఎం కార్యాలయం నుంచి ప్రత్యేకంగా అర్జీలపై ఒక బృందం పనిచేస్తోందని, నిరంతరం వారు పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ఏఎస్పీ సౌమ్యలత, కేఆర్‌సీసీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ మురళి ఉన్నారు.

గీత కార్మికుల బార్లకు లాటరీ

● ప్రభుత్వానికి రూ.40.8 లక్షల ఆదాయం

విజయనగరం క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని జేసీ కార్యాలయంలో మంగళవారం గీత కులాలకు కేటాయించిన రెండు బార్లకు జేసీ సేతుమాధవన్ ఆధ్వర్యంలో లాటరీ నిర్వహించారు. వీటికోసం ఎనిమిది దరఖాస్తులు రాగా ప్రభుత్వానికి రూ.40 లక్షల 80 వేల ఆదాయం సమకూరింది. నెల్లిమర్ల, బొబ్బిలిలోని ఒక్కోటి చొప్పున బార్లను గీత కులాలకు కేటాయించిన విషయం తెలిసిందే. జిల్లాలో 28 బార్లకు గానూ 15 బార్లకు ఎవరూ ముందుకు రాలేదు. వాటిపై ఇంకా స్పష్టత రాలేదు. తాజాగా రెండు బార్ల కోసం చేపట్టిన లాటరీ ప్రక్రియలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ చౌదరి, జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ సూపరింటెండెంట్ బి.శ్రీనాథుడు, ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారులు పాల్గొన్నారు.



జేసీ సేతుమాధవన్ సమక్షంలో బార్లకు లాటరీ తీస్తున్న ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారులు



బకాయిలపైనే దృష్టి

● డీసీసీబీలో మొండి బకాయిల వసూళ్లకు ప్రత్యేక బృందాలు
● 8 బ్రాంచిల్లో రూ.49 కోట్ల బాకీ ● 667 మందికి నోటీసులు జారీ

విజయనగరం టౌన్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) మొండి బకాయిలపై దృష్టి పెట్టింది. వాటి వసూళ్లకు ప్రత్యేక బృందాలను నియమించింది. 8 బ్రాంచిల్లో రూ.49 కోట్ల బాకీలు ఉన్నట్లు తేల్చింది. ఈ మేరకు 667 మందికి నోటీసులు కూడా జారీ చేసింది. బకాయిల వసూలుకు రెండు ప్రత్యేక బృందాలను నియమిస్తూ డీసీసీబీ సీఈవో చిప్పాడ ఉమామహేశ్వరరావు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో ఉన్న 24 బ్రాంచిల్లో అత్యధికంగా బకాయిలు ఉన్న 8 బ్రాంచిల్లో నెల్లిమర్ల, గుర్ల, గజపతినగరం, పూసపాటిరేగ, తెర్లాం, సాలూరు, సీతానగరం, గరివిడి ఉన్నాయి. ఈ బ్రాంచుల్లో 667 మంది రూ.49.03 కోట్లు బకాయి పడినట్టు గుర్తించారు. వెంటనే చెల్లించాలని బ్యాంకు అధికారులు ఎన్నిసార్లు నోటీసులు జారీ చేసినా వారు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో బకాయిల వసూళ్లలో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. బకాయిదారుల్లో అత్యధికమంది రాజకీయ నాయకులు, వారి (మిగతా 8వ పేజీలో..)

ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం

ఎనిమిది బ్రాంచిల్లో పేరుకుపోయిన పారుబాకీలను వసూలు చేసేందుకు రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు బకాయిదారులకు జప్తు నోటీసులు జారీ చేసినా పట్టించుకోవడం లేదు. బకాయిదారుల భూములను వేలం వేసేందుకు న్యాయపరమైన చర్యలకు ఉపక్రమిస్తున్నాం.

- ఉమామహేశ్వరరావు, సీఈవో, డీసీసీబీ

ఘాతుకం!

● కత్తితో తమ్ముడు దాడి
● తీవ్ర గాయాలతో అన్న మృతి



తీవ్ర గాయాలతో మృతిచెందిన శ్రీను

గజపతినగరం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అన్నపై తమ్ముడు కత్తితో దాడి చేసి ప్రాణాలు తీసిన ఘటన మండలంలోని కొత్తబగ్గాంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

కొత్తబగ్గాం గ్రామానికి చెందిన పసుపురెడ్డి శ్రీను(45) గ్రామంలో చెత్తబండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు తమ్ముడు చంటితో వివాదాలు ఉన్నాయి. అన్నయ్యపై తీవ్రంగా కక్షగట్టిన తమ్ముడు చంటి కొన్నాళ్లుగా అదును కోసం చూస్తున్నాడు. మంగళవారం గ్రామంలో వినాయక నిమజ్జనం జరుగుతోంది. ఇందులో పాల్గొన్న శ్రీను రాత్రి ఒంటరిగా తిరిగి ఇంటికి వస్తుండగా దారి కాచిన చంటి, అన్నయ్యపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. దీంతో శ్రీను రోడ్డు పక్కన అచేతన స్థితిలోకి వెళ్లిపోయాడు. రోడ్డు (మిగతా 8వ పేజీలో..)

ఊరంతా మిరపకాయలే
● అందరిదీ ఇదే వ్యాపారం
● ఉత్తరాంధ్ర జిల్లాలకు సరఫరా
● ఇదీ వియ్యంపేట ప్రత్యేకత 6

యూరియా కోసం రైతుల బారులు
● గంటలకొద్దీ నిరీక్షణ 6

నేడు జిందాల్ రైతుల కోసం గ్రామసభ 6
● కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



కీలక శాఖలు ఖాళీ

● ఇన్‌చార్జిలతో నడుస్తున్న జిల్లా స్థాయి అధికారుల ఉద్యోగాలు
● హౌసింగ్‌లో ఒక్కరికే రెండు ఇన్‌చార్జి పోస్టులు



విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి):

● జిల్లా గృహ నిర్మాణ శాఖలో విజయనగరం డీఈగా పని చేస్తున్న మురళీమోహన్‌కు ఈఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయనే జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు చూస్తున్నారు. ఇదే శాఖలో చీపురుపల్లి, బొబ్బిలి డివిజన్‌లలో ఈఈ పోస్టుల్లో డీఈలే ఇన్‌చార్జి బాధ్యతలు చూస్తున్నారు. ఈ శాఖలో క్షేత్ర స్థాయిలో సిబ్బంది కొరత చాలా ఎక్కువగా ఉంది.

● జిల్లా గ్రామీణ మంచినీటి విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో ఎస్ఈగా పనిచేస్తున్న ఉమాశంకర్ గత ఏడాది ఉద్యోగ విరమణ చేయడంతో ఇన్‌చార్జి బాధ్యతలను ఈఈగా పనిచేస్తున్న కవితకు అప్పగించారు. నెలల తరబడి ఇన్‌చార్జితోనే ఈ పోస్టు కొనసాగుతోంది.

ఈ విధంగా జిల్లాలోని కీలక శాఖల్లో జిల్లా స్థాయి అధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇన్‌చార్జిలతో నడిపిస్తున్నారు. ప్రధానంగా హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, సివిల్ సప్లయ్, పశుసంవర్ధక, ఉద్యాన, రెవెన్యూ శాఖల్లో జిల్లా స్థాయి పోస్టుల్లో ఇన్‌చార్జిలు ఉన్నారు. ఒకటి రెండు రోజులు కాదు నెలల తరబడి ఈ పోస్టుల్లో కిందస్థాయి అధికారులే ఉండి అదనపు బాధ్యతలు (మిగతా 8వ పేజీలో..)

ఊరంతా మిరపకాయలే!



మిరపకాయలను గ్రేడింగ్ చేస్తున్న మహిళలు

- అందరిదీ ఇదే వ్యాపారం
- ఇదీ వియ్యంపేట ప్రత్యేకత
- ఉత్తరాంధ్ర జిల్లాలకు అక్కడి నుంచే సరఫరా

ఎక్కడైనా కుటుంబ పెద్దలు తమ తరువాతి తరాల వారికి ఆస్తులో... భవనాలో... వారసత్వంగా ఇస్తారు. కానీ ఆ ఊరి పెద్దలు మాత్రం వ్యాపారాన్ని వారసత్వంగా ఇచ్చారు. అదీ అలాంటి ఇలాంటి వ్యాపారం కాదు. మిరపకాయల వ్యాపారం. ఒకరో.. ఇద్దరో కాదు.. ఊరందరికీ అదే వ్యాపారం.

కొత్తవలస, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి)

కొత్తవలస మండలంలోని వియ్యంపేట గ్రామానికి ఓ ప్రత్యేకత ఉంది. అక్కడ అన్ని కుటుంబాలూ మిరపకాయల వ్యాపారం మీదనే ఆధారపడుతున్నాయి. అలా అని అక్కడో... లేదా చుట్టు పక్కల గ్రామాలలో ఎక్కడైనా మిరపకాయలు పండిస్తారా అంటే అదీ లేదు. అక్కడ ఎవరిని కదిపినా తమ తాత ముత్తాతల నుంచి ఈ వ్యాపారం వారసత్వంగా వచ్చిందనే చెబుతారు. గుంటూరులోని మిరపయార్డు నుంచి ఇక్కడికి తీసుకొచ్చి... వీరంతా వ్యాపారాలు చేస్తున్నామని చెబుతున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో జరిగే ఏ సంతలోనైనా వీరి మిరపకాయలు కొనాల్సిందే. పట్టణాలు, గ్రామాలలో చిల్లర వ్యాపారుల నుంచి పెద్ద వ్యాపారుల వరకు అందరికీ వియ్యంపేట గ్రామస్తులే ఎండు మిరపకాయలను విక్రయిస్తుంటారు. గ్రామాలలో ఎవరికైనా మిరపకాయలు కావాలంటే అక్కడి వారికి సమాచారం ఇస్తే చాలు... వెంటనే సరుకుతో వస్తారు. ఆ గ్రామంలో సుమారు 200 కుటుంబాల వరకు ఉన్నాయి. వీరందరూ ఎండు మిరపకాయలు వ్యాపారంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గుంటూరు యార్డు నుంచి వారానికి రెండు నుంచి మూడు లోడుల మిరపకాయలు గ్రామానికి దిగుమతి అవుతుంటాయి. ఒక్కొక్క లోడులో 100 బస్తాల వరకు మిరపకాయలు వస్తుంటాయి. ఇక్కడి వ్యాపారుల ఆర్డర్ ను బట్టి అక్కడి వ్యాపారులు మిరపకాయలను వారికి పంపిస్తారు. మిరపకాయలలో కూడా ఆరేడు రకాలు ఉంటాయి. ఆ రకాలను బట్టి ధరలు ఉంటాయి. ఆర్డర్ చేసిన ప్రతి బస్తాపై మార్కింగ్... ఆ వ్యాపారికి సంబంధించిన కోడ్ ఉంటుంది. దీని ఆధారంగా లోడు రాగానే ఎవరి బస్తాలను వారు తీసుకెళుతుంటారు.



కాడలను తీయడానికి మిరపకాయలను యంత్రంలో వేస్తున్న మహిళ

గ్రామంలో గ్రేడింగ్...

గుంటూరు యార్డు నుంచి వియ్యంపేటకు వచ్చిన తరువాత మిరప రకాలను బట్టి గ్రేడింగ్ చేసి విక్రయిస్తుంటారు. ముఖ్యంగా వీటి కాడలను తీయడమే పెద్ద పని. గుంటూరు నుంచి మిరపకాయలు ఇక్కడికి కాడలతో వస్తుంటాయి. ఇక్కడ కూలీలను పెట్టుకుని వాటిని తొలగించే వారు. గతంలో ఈ కాడలు తీయడం ద్వారా మహిళలు ఉపాధి పొందేవారు. కిలో మిరపకాయలకు కాడలు తొలగించడానికి రూ.6 వరకు ఇచ్చేవారు. ఒక్కొక్క మహిళ ఈ కాడలు తీయడం ద్వారా రోజుకు రూ.500 నుంచి రూ.700 వరకు సంపాదించేవారు. కాడలు తొలగించడానికి యంత్రాలు రావడంతో ఉపాధి కోల్పోయారు. కాయల గ్రేడింగ్.. కాడలు తొలగించడం... బస్తాలలో ఎత్తించడం వంటివి మహిళలు చేయిస్తే... వాటిని సంతలు, చిల్లర, హోల్‌సేల్ వ్యాపారులకు విక్రయించే బాధ్యతను పురుషులు చూసుకుంటారు.

పూర్వీకుల నుంచి ఇదే వ్యాపారం..



మా పూర్వీకుల నుంచి మిరపకాయల వ్యాపారమే చేస్తున్నాం. నేను ఎం.టెక్ వరకు చదువుకున్నా ఈ వ్యాపారాన్ని చేయడం ఆనందంగా ఉంది. గతంలో వ్యవసాయం చేసేవాళ్లం. వర్షాభావ పరిస్థితుల కారణంగా సరుగుడు తోటలు వేసుకున్నాం. గుంటూరు వ్యాపారులతో ఉన్న సంబంధాల కారణంగా అరువుపై సరుకు ఇస్తుంటారు. ప్రస్తుతం కిలో ధర రూ.120 నుంచి రూ.200 వరకు ఉంటోంది.

-నీలంశెట్టి హరీష్, వియ్యంపేట



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు

విద్యార్థులు లక్ష్యంపై దృష్టి పెట్టాలి: ఎమ్మెల్సీ గాదె

భామిని, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకొని విద్యార్థులు తమ లక్ష్యాన్ని సాధించాలని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు సూచించారు. మంగళవారం ఏఐఎం ఉద్యోగులు, పీఆర్‌టీయూ సహకార సంఘం ఆధ్వర్యంలో భామిని ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవడానికి నిరంతరం ప్రయత్నించాలని సూచించారు. ఆ పాఠశాల శతశాతం ఉత్తీర్ణతను సాధించడంపై ఉపాధ్యాయులను అభినందించారు. ఇదిలాఉండగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేజీబీవీ, గిరిజన ఆశ్రమ పాఠశాలల సీఆర్‌టీలు ఆయనకు వినతిపత్రం అందించారు. దీనిపై ఆయన స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానికుల కోరిక మేరకు ఆదర్శ పాఠశాల వసతి గృహానికి మరో 50 సీట్లు, అదనపు భవనాల కోసం మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. బురుజోల పాఠశాల భవనం మంజూరుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాబూరావు, ఎంఈవో శ్రీనివాసరావు, భాస్కర్‌రావు, కె.శివకుమార్, ఎం.ప్రఫుల్లకుమార్, రాజశేఖర్, ఆనందరావు, ప్రసాదరావు పాల్గొన్నారు. అనంతరం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

కమిటీల ఏర్పాటుకు సన్నాహాలు

- విశాఖలో టీడీపీ నేతల సమావేశం

పార్వతీపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అరకు పార్లమెంట్‌తో పాటు అనుబంధ కమిటీల ఏర్పాటుపై విశాఖ టీడీపీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అరకు పార్లమెంట్‌లో 34 మంది, 17 అనుబంధ కమిటీల్లో 28 మంది సభ్యులు ఉండాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో అరకు పార్లమెంట్ అధ్యక్షుడు కె.శ్రావణ్‌కుమార్, మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష, వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జిలు గిడ్డి ఈశ్వరి, దొన్ను దొర, పడాల భూదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రి సంధ్యారాణి, శ్రావణ్ తదితరులు

యూరియా కోసం రైతుల బారులు

- గంటలకొద్దీ నిరీక్షణ

పాలకొండ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పాలకొండలోని ప్రధాన రహదారిలో ఉన్న ఓ ప్రైవేటు ఎరువుల దుకాణం వద్ద మంగళవారం రైతులు యూరియా కోసం బారులు తీరారు. ఒక ప్రైవేటు వ్యాపారి యూరియా తెచ్చిన విషయం తెలుసుకొని కొనుగోలు చేసేందుకు రైతులు క్యూ కట్టారు. సోమవారం సాయంత్రం వ్యాపారి యూరియాను విక్రయిస్తున్న విషయం వ్యాపించడంతో మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి రైతులు బారులు తీరారు గంటల కొద్దీ నిరీక్షించారు. పాలకొండ- శ్రీకాకుళం ప్రధాన రహదారి కావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా ఎస్ఐ ప్రయోగమూర్తి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది రైతులు క్యూ పద్ధతి పాటించి... ఎరువులు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టారు. యూరియా బస్తా రూ.266కే విక్రయించాల్సి ఉంది. కానీ ఆ వ్యాపారి రూ.450 చొప్పున అమ్మకాలు చేసినట్టు తెలిసింది. దీంతో కొంతమంది రైతులు విజిలెన్స్ అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న విజిలెన్స్ సీఐ రవిప్రసాద్, వ్యవసాయశాఖ ఏడీఏ రమాప్రభ, ఏవో ప్రసాదరావు ఎరువుల దుకాణం వద్దకు చేరుకొని రైతులు, వ్యాపారులతో మాట్లాడారు. యూరియాను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారిని హెచ్చరించారు. తాను విజయనగరం నుంచి యూరియాను కొనుగోలు చేసి తెచ్చానని... రవాణా చార్జీలు, కూలీల ధర గిట్టుబాటయ్యేలా చర్యలు తీసుకోవాలని వ్యాపారి అధికారులను కోరారు. దీనితో అధికారులు రవాణా చార్జీలు, హమాలీల చార్జీలతో కలిపి రూ.300కు ఒక యూరియా బస్తా అమ్మేలా చర్యలు చేపట్టారు.



యూరియా కోసం క్యూ కట్టిన రైతులు



స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువులు సీజ్

ఇదిలా ఉండగా ఎరువుల దుకాణాలను విజిలెన్స్, వ్యవసాయ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. అదే వ్యాపారి గోడాముల్లో అక్రమంగా నిల్వ ఉంచిన 127 బస్తాల యూరియా, 15 బస్తాల డీఏపీని విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. ఈ మేరకు సంబంధిత వ్యాపారిపై 6ఎ కేసు నమోదు చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ రవి ప్రసాద్, వ్యవసాయశాఖ ఏడీఏ రత్నకుమారి, ఏవో ప్రసాదరావు పాల్గొన్నారు.



పట్టాలపై లారీ... పరుగులు చూశారా మరి

'ఎప్పుడూ రోడ్డుపైనే పరుగులెత్తిస్తారా? ఓసారి పట్టాలపైకి ఎక్కించి చూడండి.. నేనేంటో చూపిస్తా. వేగంలో రైలుకు ఏమాత్రం తీసిపోకుండా పరుగు పెడతా' అన్నట్టుంది కదా ఈ చిత్రం. ఇంతకీ ఈ లారీ పట్టాలపైకి ఎందుకు చేరిందో తెలియాలంటే గజపతినగరం వెళ్లాలి. ఈ ప్రాంతంలో మూడో రైల్వే లైను పనులు చురుగ్గా సాగుతున్నాయి. రైలు పట్టాల జాయింట్ కోసం వెల్డింగ్ పనులు చేపట్టేందుకు జనరేటర్‌తో పాటు వెల్డింగ్ మిషన్, ఇతర సామగ్రిని తీసుకెళ్లాల్సి ఉంటోంది. వీటిని లారీల్లో తరలిస్తున్నారు. పట్టాలపై లారీ నిలిచే విధంగా యంత్రాలను అమర్చి... వాటి ద్వారా నడిపిస్తున్నారు. అదండీ ఈ లారీ పరుగు వెనుక కథ.

-గజపతినగరం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి)

నేడు జిందాల్ రైతుల కోసం గ్రామసభ

- కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్

విజయనగరం కలెక్టరేట్/ ఎస్.కోట/ ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిందాల్ రైతుల సమస్యల పరిష్కారం కోసం ఎస్.కోట మండలం మూల బొడ్డవర గ్రామంలో కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో బుధవారం గ్రామ సభ నిర్వహించనున్నట్టు కలెక్టర్ డా.బీఆర్ అంబేడ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లు, ఆధారాలతో గ్రామసభకు హాజరు కావాలని ఆయన సూచించారు. రికార్డుల పరంగా కచ్చితంగా ఉన్నవారికి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ గ్రామ సభకు రెవెన్యూ అధికారులతో పాటు జిందాల్ కంపెనీ ప్రతినిధులు హాజరవుతారని వివరించారు. జిందాల్ కోసం సేకరించిన భూములలో ఎస్.కోట మండలంలోని 5 గ్రామాలకు చెందిన రైతులకు తమకు అన్యాయం జరిగిందని, తగిన పరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు కలెక్టర్ పీజీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ద్వారా, లోక్‌సత్తా పార్టీ ద్వారా నేరుగా సుమారు 45 మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. దరఖాస్తు చేసిన వారే కాకుండా అన్యాయం జరిగిందనుకునే మిగిలిన రైతులు కూడా హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. ఇదిలా ఉండగా స్థానిక తహసీల్దార్ శ్రీనివాసరావు కూడా ఇదే విషయాన్ని రైతులకు తెలియజేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

భూగర్భ జలాల పెంపునకు చర్యలు

జిల్లాలో భూగర్భ జల మట్టం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. దీని కోసం చెక్‌డ్యామ్‌లు, ఫారం పాండ్స్ నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలన్నారు. అందుకు అవసరమయ్యే ప్రతిపాదనలు పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 3 మీటర్ల లోపల 17 మండలాల్లో భూగర్భ జలాలు ఉన్నాయన్నారు. 3 నుంచి 8 మీటర్ల లోపల 9 మండలాలు, 9 మీటర్ల లోతులో రెండు మండలాల్లో భూగర్భ జలాలు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో సరాసరి 3.80 మీటర్ల లోతులో జలాలు ఉన్నాయని వివరించారు. జిల్లాలో 215 గ్రామాల్లో భూగర్భ నీటి స్థాయిలు తక్కువగా ఉన్నట్లు గుర్తించామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ శారదాదేవి, ఇరిగేషన్ ఈఈ రమణ, గ్రౌండ్‌వాటర్ డీడీ దినకర్ పాల్గొన్నారు.

కార్యాలయం ప్రారంభం..

ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త కార్యాలయం కలెక్టరేట్ సమీపంలోని మర్రిచెన్నారెడ్డి భవన ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. ఈ నూతన కార్యాలయాన్ని కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం డీఆర్‌డీఏ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో పీడీ శ్రీనివాసరావు, సమన్వయకర్త రూపవతి తదితరులు పాల్గొన్నారు.

ఎల్.కోటలో భారీ వర్షం



చెరువును తలపిస్తున్న పొలం

లక్కవరపుకోట, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఎల్.కోట పరిసర ప్రాంతాలైన కల్లేపల్లి, రేగ, సీతాగొర్లెవానిపాలెం, పూడివానిపాలెం, శ్రీరాంపురం, లింగంపేట, లచ్చింపేట గ్రామాల్లో సుమారు గంటన్నర పాటు భారీ వర్షం కురిసింది. దీంతో చెరువులు నిండు కుండల్లా కనిపిస్తున్నాయి. కోటవాని చెరువు గెడ్డ వరదనీటితో ప్రవహించడం మొదలైంది. సుమారు 16 కిలోమీటర్ల మేర ఇది ప్రవహిస్తుంది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అక్కడక్కడ వరిపంట నీట మునిగే స్థాయికి చేరుకున్నాయి. ఈ విషయమై ఏఎస్‌వో కృష్ణను వివరణ కోరగా ఆగస్టులో 40 సెంటీమీటర్ల వర్షం అవసరం కాగా.. 80 సెంటీమీటర్లు నమోదైందని తెలిపారు. మంగళవారం వర్షం ఎక్కువగా ఉందని... మరో రెండు రోజులు రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

నాగావళికి జలకళ..

రేగిడి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావం, ఎగువన పడుతున్న వర్షాలతో నాగావళి జలకళను సంతరించుకుంది. మడ్డువలస, తోటపల్లి ప్రాజెక్టుల నీరు నదిలో విడిచిపెట్టడంతో నాగావళిలో మంగళవారం నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. సంకిలి వంతెన వద్ద రెండు ఒడ్డులను కలిపి ప్రవహిస్తోంది. లోతట్టు గ్రామాలైన బొడ్డవలస, పుర్లి, కొమరి, వెంకటాపురం, ఖండ్యాం, రేగిడి, పాతచెలిగానవలస తదితర ప్రాంతాలను వరద భయం వెంటాడుతోంది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులు స్థానికులకు సూచిస్తున్నారు.



జియ్యమ్మవలస: వట్టిగెడ్డ స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం



సంకిలి వంతెన వద్ద నాగావళి ప్రవాహం



మొక్కులు చెల్లించుకునేందుకు పోటెత్తిన భక్తులు

ఘనంగా వారాల పండుగ

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తవలస గ్రామ ప్రజల ఆరాధ్య దైవం కొత్తపోలమ్మ తల్లి వారాల పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలందరూ పెద్దవీధిలోని అమ్మవారి వనం గుడి వద్దకు చేరుకున్నారు. వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా అమ్మవారికి చీరలు, కోళ్లను సమర్పించి.. మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారికి మొక్కుకున్నట్లు భక్తులు తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు వారాల్లో పాల్గొనడంతో వీధులన్నీ కిటకిటలాడాయి.

వ్యవసాయంలో సాంకేతికత జోడించండి



డ్రోన్ అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్

జామి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతులు తమ వ్యవసాయంలో సాంకేతికత జోడిస్తే ఆర్థికంగా ప్రగతి సాధిస్తారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం విజయనగరంలో ఆయన ఎం.కొత్తవలస గ్రామానికి చెందిన రైతు కూనిరెడ్డి సత్యనారాయణమూర్తికి టీడీపీ మండల అధ్యక్షుడు స్వామినాయుడు ఆధ్వర్యంలో డ్రోన్‌ను అందజేశారు. రాయితీపై బ్యాంకులు ఇస్తున్న డ్రోన్లను వినియోగించుకోవాలన్నారు.

పైడిమాంబ ఆలయంలో చండీయాగం



పుష్పాలంకరణలో పైడితల్లి

విజయనగరం కల్చరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం పైడిమాంబ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని మూడు లాంతర్ల వద్ద ఉన్న చదురుగుడి, రైల్వేస్టేషన్ వద్ద ఉన్న వనంగుడి వద్ద చండీహోమాన్ని నిర్వహించారు. మూడు లాంతర్ల వద్ద ఉన్న చదురుగుడిలో పైడిమాంబకు వివిధ రకాల పువ్వులతో ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ఉచితంగా ప్రసాదాన్ని అందించారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

గరివిడి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కోనూరు గ్రామానికి చెందిన అమెరికా నివాసి (ఎన్‌ఆర్‌ఐ) అలమండ కృష్ణ తన తండ్రి తాతినాయుడు జ్ఞాపకార్థం గత 20 ఏళ్ల నుంచి అదే గ్రామంలోని ఉన్నత పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. దీనిలో భాగంగా ఈ ఏడాది ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మంగళవారం రూ.26వేలను ప్రోత్సాహకంగా అందజేశారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వండి

కొత్తవలస, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాలయాపన చేయడం మాని అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా సమితి కార్యవర్గ సభ్యుడు డేగల అప్పలరాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆయన పేదలతో కలిసి ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ అప్పలరాజుకు వినతిపత్రం అందజేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

బొండపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం విశాఖపట్టణం నుంచి రాయ్‌పూర్ ఐరెన్ ఓర్ లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఎవ్వరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

నీట్ పీజీలో హర్షిత ప్రతిభ



కుటుంబంతో హర్షిత

శృంగవరపుకోట, సెప్టెంబరు 2(ఆంధ్ర జ్యోతి): శృంగవరపుకోట పట్టణానికి చెందిన డాక్టర్ స్వర్ణపూడి వెంకట సత్య ప్రసన్న హర్షిత నీట్ పీజీలో ప్రవేశ పరీక్షలో 6,327 ర్యాంకు సాధించారు. ఓబీసీ కేటగిరికి చెందిన వారు కావడంతో విశాఖపట్టణం ఆంధ్రా మెడికల్ కళాశాలలో గైనకాలజీ విద్యను అభ్యసించేందుకు అవకాశం వస్తుందని ఆశిస్తున్నారు. ఆమె తండ్రి ఎస్‌వీ సత్యశేఖర్ వైద్యుడు. గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా సేవలు అందిస్తున్నారు. తల్లి అపర్ణ గృహిణి.

రెండు నెలలుగా అందని పింఛన్

వేపాడ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): తనకు రెండు నెలలుగా పింఛన్ అందడం లేదని వీలుపర్తి పంచాయతీ చినదుంగాడ గ్రామానికి చెందిన నల్గొండ అప్పలనరస(44) అనే దివ్యాంగ ఎస్సీ మహిళ మంగళవారం స్థానిక విలేకర్ల వద్ద వాపోయారు. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తనకు పింఛన్ అందలేదని ఆమె ఆరోపించారు. దీనిపై స్థానిక గ్రామ కార్యదర్శి రంగారావును వివరణ కోరగా.. పింఛన్ల వ్యవహారం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ చూసుకుంటారని చెప్పారు.

జాప్యం చేస్తే సహించేది లేదు

ఈ విషయాన్ని ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లగా.. పింఛన్ల పంపిణీలో జాప్యం చేస్తే సహించేది లేదని, దివ్యాంగ మహిళకు వెంటనే పింఛన్ అందజేయిస్తానని తెలిపారు. అలాగే విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తున్న గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకుంటామన్నారు.

గణేష్ నిమజ్జనాల్లో జాగ్రత్తలు తీసుకోండి

- ఎస్పీ వకుల్ జిందాల్



జూమ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎస్పీ

విజయనగరం క్రైం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాల నిమజ్జన వేడుకల్లో ఎటువంటి అపశృతి చేటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిమజ్జనాలకు వెళ్లే మార్గంలో వాహనాల రాకపోకలకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఊరేగింపుల్లో డీజేలకు అనుమతి లేదన్నారు. అశ్లీల నృత్యాలు నిర్వహించకుండా చూడాలన్నారు. మద్యం తాగడం, కళ్లకు హానికలిగించే రంగులు జల్లుకోవడం, బాణసంచా కాల్చడం చేయరాదన్నారు. మతసామరస్యాన్ని పాటించాలన్నారు. నిమజ్జనం నిర్వహించే చెరువులు, నదుల వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, గజ ఈతగాళ్లను నియమించాలని, ఎలక్ట్రికల్ ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. డీఎస్పీలు పర్యవేక్షించాలని, సంబంధిత సీఐలు, ఎస్‌ఐలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

ఘనంగా పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు

- పాల్గొన్న ఎమ్మెల్యేలు, జనసేన నాయకులు
- వైద్య, రక్తదాన శిబిరాల ఏర్పాటు

జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకలను విజయనగరం జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ, జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. పలుచోట్ల రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఈసందర్భంగా పవన్‌కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

(ఆంధ్రజ్యోతి బృందం)



విజయనగరం దాసన్నపేట: వేద విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేసిన జనసేన నాయకులు పాలవలస యశస్వి, గురాన అయ్యలు



గజపతినగరం: ర్యాలీ చేస్తున్న జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సురేష్



మెంటాడ: రక్తదాన శిబిరంలో పాల్గొన్న మాజీ మంత్రి పడాల అరుణ



కొత్తవలస: వేడుకల్లో పాల్గొన్న ఎస్.కోట ఎమ్మెల్యే లలితకుమారి



చీపురుపల్లి: రక్తదాన శిబిరంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు



శృంగవరపుకోట: రోగులకు పండ్లు అందజేస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సత్యనారాయణ



విజయనగరం: జనసేన నేత అవనాపు విక్రమ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

రైతులకు ప్రత్యేక మెగా గ్రీవెన్స్

లక్కవరపుకోట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో రీసర్వే జరగని 20 గ్రామాల రైతులకు భూసమస్యల పరిష్కారార్థం ప్రత్యేక మెగా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఈనెల 9న కుద్దులవలస, తలారి, ఎల్‌కేఎస్ పురం, కిత్తన్నపేట, భీమాలి, కల్లేపల్లి, ఖాసాపేట, కొట్యాడ, మార్లాపల్లి, రంగారాయపురం గ్రామాల రైతులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 10న గనివాడ, నిడిగట్టు, మల్లివీడు, రేగ, లచ్చింపేట, వెంకన్నపాలెం, చందులూరు, శ్రీరాంపురం, తామరాప ల్లి, గజపతినగరం రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పాత పురోణీలు, డాక్యుమెంట్‌లు ఉన్నవారు, తండ్రి చనిపోయి వారసుల పేరున భూమి మ్యూటేషన్ కానివారు సంబంధింత ఆధారాలతో ఎల్.కోటకు రావాలన్నారు.

పాఠశాలల పరిశీలన

గంట్యాడ, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల డైట్ అధ్యాపక బృందం మండలంలోని పలు పాఠశాలలను మంగళవారం పరిశీలించింది. పెదమజ్జిపాలెం, సిరిపురం ఎంపీపీ పాఠశాలలు, వసాది జడ్పీ హైస్కూల్, గంట్యాడ కేజీబీవీలను పరిశీలించారు. సిరిపురం ప్రాథమిక పాఠశాలలో కొన్ని సబ్జెక్టుల్లో సిలబస్ ఇంకా పూర్తికావల్సి ఉందని గుర్తించారు. దీర్ఘకాలిక సెలవులో ఉన్న విద్యార్థులను వెనక్కి రప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ బృందంలో అధ్యాపకులు వాక చిన్నంనాయుడు, శశిభూషణరావు, అన్నారావు, శ్రీనివాసరావు ఉన్నారు.

ఐడీసీ బోర్డు డైరెక్టర్‌కు సత్కారం

రాజాం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఐడీసీ) బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన కొటగిరి నారాయణరావును మంగళవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర ప్రభుత్వం 25 మందికి అవకాశం కల్పించగా అందులో రాజాం నియోజకవర్గం నుంచి కోటగిరి నారాయణరావును నియమించడం ఎంతో గర్వంగా ఉందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జొన్నాడ రంజిత్ అన్నారు. పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ వేమకోటి గిరిబాబు, పట్టణ మండల జనరల్ సెక్రటరీ చల్లా అజయ్, జిల్లా కోశాధికారి బి.సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి గుడివాడ నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా నేత్రదాన పక్షోత్సవాలు

రాజాం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): జీవించి ఉన్నపుడు ప్రేమ.. మరణానంతరం వెలుగుని ప్రసాదించాలని పట్టణ పీహెచ్‌సీ వైద్యాధికారి యు.కిరణ్‌కుమార్ అన్నారు. జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, రోటరీ క్లబ్ సంయుక్తంగా స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం ఆశా వర్కర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఆప్తాలమిక్ అధికారి, రోటరీ క్లబ్ రాజాం కార్యదర్శి ఎస్.వసంతరావు, నర్సింగ్ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పైడితల్లి జాతర పనులు 20లోగా పూర్తిచేయండి



సమీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): పైడితల్లమ్మ జాతర పురస్కరించుకుని నగరపాలక సంస్థ ద్వారా చేయాల్సిన పనులను ఈనెల 20లోగా పూర్తిచేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఆదేశించారు. మంగళవారం ఆయన చాంబర్‌లో వివిధ విభాగాల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. పలు శాఖల వారిగా నిర్వహించాల్సిన పనులపై చర్చించారు. ముఖ్యంగా నగరం సుందరీకరణకు ప్రాముఖ్యత ఉండాలన్నారు. ఎక్కడ వీధి దీపాల సమస్య ఉండకుండా చూడాలని, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలని సూచించారు. నగరపాలక సంస్థ ప్రాంగణంలో ప్రముఖుల ఫొటోలతో కూడిన ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ ఆలస్యమైతే సహించేది లేదు

రేగిడి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): సంకిలి సచివాలయ సిబ్బంది పనితీరుపై ఎంపీడీవో శ్యామలాకుమారి మండిపడ్డారు. ముందురోజు ఇవ్వాల్సిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఆలస్యంగా ఇవ్వటం, సిబ్బంది రెండో పూట సచివాలయంలో అందుబాటులో లేకపోవటం ఆమె దృష్టికి వెళ్లింది. దీంతో ఆమె తీవ్రంగా పరిగణించారు. మంగళవారం సంకిలి సచివాలయాన్ని తనిఖీ చేసి, సిబ్బందితో సమీక్షించారు. సిబ్బందిలో సమన్వయ లోపం, ఈ సచివాలయం వివిధ సర్వేల్లో ప్రగతి వెనకబడి ఉన్నట్టు ఆమె గుర్తించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, ఇకపై పింఛన్ల పంపిణీలో ఆలస్యం జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రధానంగా ఇక్కడ రెగ్యులర్ సెక్రటరీ లేకపోవటంతో ఈ సమస్యలు వస్తున్నాయని, దీనిపై దృష్టి సారించాలని ఎంపీడీవోను స్థానిక టీడీపీ నాయకుడు కర్రి రమణ, ఉపసర్పంచ్ గుండ పకీరు కోరారు.

చింతపల్లిలో కొబ్బరి దినోత్సవం

పూసపాటిరేగ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): చింతపల్లి గ్రామంలో జిల్లా కొబ్బరి ప్రొడ్యూసర్ ఫెడరేషన్ అధ్యక్షుడు మొంగం శ్రీనివాసరావు, ఉద్యానవనశాఖ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ కొబ్బరి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా కొబ్బరి అభివృద్ధి బోర్డుకు సంబంధించిన పథకాలను, ఉద్యానవనశాఖ అందజేస్తున్న పథకాలపై ఉద్యానవన అధికారిణి ఉమాభరణి వివరించారు. కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసరావు కొబ్బరి పంటల యాజమాన్య పద్ధతులపై, అంతర పంటలపై రైతులకు వివరించారు. ఈసందర్భంగా కొబ్బరి పంటలో ఎక్కువ దిగుబడి సాధించిన రైతులను అధికారులు సన్మానించారు. నెల్లిమర్ల నియోజకవర్గ పీ4 కమిటీ కన్వీనరు ఆళ్ల వెంకటేశ్వరరావు, విక్రం జగన్నాథం, ఎం.ఎరకయ్యదొర పాల్గొన్నారు.

బొండపల్లిలో గ్రామ సభ

బొండపల్లి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బొండపల్లి సచివాలయంలో సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సంతోష్‌తో పాటు అన్ని శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. జనసేన లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ డోలా రాజేంద్ర ప్రసాద్ సభలో మాట్లాడుతూ 2021 సంవత్సరంలో తీర్మానం చేసిన మట్టి రోడ్డు పనులను 2025 సంవత్సరంలో ఎటువంటి పంచాయతీ తీర్మానం లేకుండా ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో పాటు పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3.50 లక్షలు కలిపి గ్రామస్థులకు ఉపయోగంలేని పొలాలకు రూ.35లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మాణం చేపట్టారని తెలిపారు. సచివాలయం సిబ్బంది సమయపాలన పాటించడం లేదని మాజీ ఎంపీపీ బంగారం, మాజీ జడ్పీటీసీ సభ్యుడు బి.బాలాజీ.. అధికారులను నిలదీశారు. వైస్ ఎంపీపీ గొందేల ఈశ్వరరావు, పంచాయతీరాజ్ జేఈ పి.అప్పలనాయుడు, ఉపాధి ఏపీవో అరుణ కుమారి పాల్గొన్నారు.

సీఐటీయూ మహా సభలు జయప్రదం చేయండి

రాజాం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక చీపురుపల్లి రోడ్డులో నటరాజ్ ఫంక్షన్ హాలులో ఈనెల 7, 8 తేదీలలో జరుగనున్న సీఐటీయూ మహా సభలను జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూని యన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి, సీఐటీ యూ జిల్లా కార్యదర్శి జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం వారు బొద్దాం, పొగిరి పీహెచ్‌సీలను సందర్శించి, ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ● రాజాం రూరల్: రాజాంలో ఈనెల 7, 8 తేదీలలో సీఐటీయూ మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నటరాజ్ కల్యాణ మండపంలో నిర్వహించనున్న ఈ సభలకు సుమారు 200 మంది ప్రతినిధులు హాజరవుతారని ఆయన చెప్పారు.

చెట్ల తొలగింపునకు ఎవరు బాధ్యత వహిస్తారు?

- జిందాల్ నిర్వాసితుల ఆందోళన



రోడ్డుపై బైఠాయించి ఆందోళన వ్యక్తం చేస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జిందాల్ పరిశ్రమ ఏర్పాటు పేరుతో 18ఏళ్ల కిందట భూములు సేకరించి, ఎటువంటి పరిశ్రమ పెట్టని యాజమాన్యం గత మూడు నెలలుగా ఈ భూముల్లో ఉన్న వేలాది చెట్లను పెకిలిస్తుందని జిందాల్ నిర్వాసితులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం బొడ్డవర గ్రామం వద్ద చేసిన నిరసన దీక్షలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, నిర్వాసితులు మాట్లాడారు. కోర్టు తీర్పు నిర్వాసితులకు అనుకూలంగా వస్తే చెట్లు తొలగించిన బాధ్యత ఎవరు స్వీకరిస్తారని ప్రశ్నించారు.

వాల్టా చట్టానికి తూట్లు..

ఎస్.కోట మండలంలోని బొడ్డవర, కిల్తంపాలెం, ముషిడిపల్లి పంచాయతీల పరిధిలో జిందాల్ సంస్థ గత మూడు నెలలుగా వాల్టా చట్టాన్ని అతిక్రమించి వేలాది వృక్షాలను కూల్చేస్తున్నా జిల్లా, మండల స్థాయి అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ప్రశ్నించారు. మంగళవారం బొడ్డవరలోని తన నివాసంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. రైతుల సాగులో ఉన్న చెట్లకు ఆనాడు డబ్బులు ఇస్తామన్న యాజమాన్యం కేవలం భూమికి డబ్బులు ఇచ్చి చేతులు దులుపు కుందన్నారు. రెండు రోజుల కిందట హైకోర్టులో కేసు విచారణకు వచ్చిందని, ఈ విచారణ చూస్తే రైతులు విజయం సాధిస్తారన్న నమ్మకం కలిగిందన్నారు.

గల్లంతైన మాజీ సర్పంచ్ మృతదేహం లభ్యం



రామారావు (ఫైల్)

సాలూరు రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దుగ్గసాగరం వద్ద వట్టిగెడ్డలో సోమవారం గల్లంతైన నెలిపర్తి మాజీ సర్పంచ్ మంచాల రామారావు (45) మృతదేహం విజయనగరం జిల్లా కొట్టక్కి వద్ద మంగళవారం లభ్యమైంది. వట్టిగెడ్డ దాటుతూ మాజీ సర్పంచ్ రామారావు గల్లంతైన విషయం పాఠకులకు విధితమే. ఆయన మృతదేహం కోసం పోలీసులు గాలించారు. వరద ఉధృతికి మృతదేహం సరిహద్దు జిల్లా విజయనగరం పరిధిలో కొట్టక్కి సమీపాన లభ్యమైంది. విజయనగరం జిల్లా రామభద్రపురం ఎస్ఐ వెలమల ప్రసాద్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. ఇసుక కోసం నదిలో పెద్ద పెద్ద గోతులు తీయడంతో ఆ ప్రాంతానికి ఈత కొడుతూ వచ్చిన రామారావు వరద ఉధృతికి బలయ్యాడనే అభిప్రాయం దుగ్గసాగరం గ్రామస్థులు వ్యక్తం చేశారు. రామారావు 14 ఏళ్ల క్రితం నెలిపర్తి పంచాయతీకి సర్పంచ్‌గా పనిచేసి ప్రజల మన్నన పొందారు. ఆయనకు కొడుకు అనంత్ యోగీశ్వర్, కూతురు శ్రావ్య ఉన్నారు. ఆయన మృతితో పంచాయతీలో విషాదం నెలకొంది.

సర్వేయర్ ఆత్మహత్య

సీతంపేట రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వంబరెల్లి గ్రామానికి చెందిన సవర బలరాం(31) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐ అమ్మనరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. వంబరెల్లి గ్రామానికి చెందిన సవర బలరాం భామిని మండలంలోని బత్తిలి సచివాలయం-1లో సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అయితే కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతున్న బలరాం గ్రామ సమీపంలోని జీడితోటలో చెట్టు కు ఉరి వేసుకుని మృతి చెందారన్నారు. మృతుడికి భార్య దేవి, నీష, చారుమతి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. బలరాం బలవన్మరణంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. తమ పిల్లలకు దిక్కెవరని భార్య దేవి గుండెలవిసేలా రోదించారు. మృతుడి భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పురుగు మందు తాగి ఒకరు..

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): కలవరాయి గ్రామానికి చెందిన ఎద్దుబోను ఆదినారాయణ(44) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. వివరాల్లో వెళితే.. కొద్ది కాలంగా ఆయన ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నట్టు సమాచారం. సోమవారం సాయంత్రం 6 గంటల సమయంలో తన భార్య మంగమ్మ కూరగాయలకు బయటకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఆయన ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగారు. ఇంటికి వచ్చిన భార్య విషయం తెలుసుకుని బొబ్బిలి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించింది. మెరుగైన చికిత్స కోసం ఆయనను విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అదేరోజు రాత్రి 9 గంటలకు చికిత్స పొందుతూ ఆసుపత్రిలో మృతిచెందారు. మృతుడికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. పెద్ద కుమారుడు ఇంటర్మీడియట్ చిన్న కుమారుడు 8వ తరగతి చదువుతున్నారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ సన్యాసిరావు కేసు నమోదు చేశారు.

ఆకులోవ గెడ్డలో మృతదేహం

రేగిడి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తచెలిగానవలస గ్రామం దరిలో ఆకులోవగెడ్డలో మంగళవారం ఒక మృతదేహం లభ్యమయ్యింది. అటుగా వెళ్లిన గ్రామస్థులకు మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఈ మృతదేహం ఇదే గ్రామానికి చెందిన లండ రామారావు (57)దిగా గుర్తించారు. దీనిపై ఎస్ఐ నీలావతి కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఆగస్టు 28న వెదురుబొంగులు కొట్టేందుకు ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రామారావు తిరిగి రాలేదు. దీనిపై అదేరోజు భార్య కళావతి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు అదృశ్యం కేసుగా నమోదు చేశారు. ఈక్రమంలో మంగళవారం ఆకులోవగెడ్డ వద్ద రామారావు మృతదేహం లభ్యమయ్యింది. ఈయన కర్రలు కొడుతుండగా గెడ్డలో ప్రమాదవశాత్తు జారి పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడికి భార్య కళావతితో పాటు పెళ్లయిన ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యం

రామభద్రపురం, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): బూసాయవలస గ్రామానికి చెందిన కళ్యారి చిన్నమ్మలు అదృశ్యమైనట్టు భర్త కుమార్ మంగళవారం ఫిర్యాదు చేశారని ఎస్ఐ వెలమల ప్రసాద్ తెలిపారు. ఈనెల 22న సాలూరు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి ఆమె వెళ్లిందని, నేటికీ ఆమె తిరిగి రాలేదని కుమార్ ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పది కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు

శృంగవరపుకోట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పది కిలోల గంజాయితో పట్టుబడిన ఇద్దరు ఇద్దరిని ఎస్.కోట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. దీనిపై సీఐ వి.నారాయణమూర్తి వివరాలు వెల్లడించారు. మంగళవారం బొడ్డవర చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఇద్దరు వ్యక్తులు లగేజీ బ్యాగులతో పారిపోతున్నారు. వెంటనే పోలీసులు వారిని పట్టుకుని, బ్యాగులను పరిశీలించారు. అందులో ఏడు ప్యాకెట్లతో పది కిలోల గంజాయిని గుర్తించారు. పోలీసులు వీటిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను విచారించారు. కర్ణాటక రాష్ట్రం బెంగుళూరు సమీపంలోని తిరుమల శెట్టి గ్రామానికి చెందిన పవన్ మంజూనాథ్, చరనా చారిలుగా గుర్తించారు. ఇద్దరినీ అదుపులోకి తీసుకొని, రిమాండ్‌కు పంపించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

గంట్యాడ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గంట్యాడ మండలం కొర్లం, కొండ తామరపల్లి గ్రామాల మధ్య ఎస్.కోట రహదారిపై మంగళవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని గింజరు గ్రామానికి చెందిన సీహెచ్ గౌరునాయుడు (32) మృతిచెందారు. ఈయన తామరపల్లి నుంచి గింజరు వెళ్తుండగా తాటిపూడి నుంచి విజయనగరం వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొని ఉండొచ్చునని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఎస్ఐ సాయికృష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల దుకాణంపై 6ఏ కేసు నమోదు

నెల్లిమర్ల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బొప్పడాం జంక్షన్‌లో ఉన్న రాజరాజేశ్వరి ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని మంగళవారం రాత్రి శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ బి.సింహాచలం తనిఖీ చేశారు. రికార్డులు, బిల్లు పుస్తకాలతో పాటు ఎరువుల నిల్వలను పరిశీలించారు. అమ్మకాలకు సంబంధించి బిల్లులు సక్రమంగా లేకపోవడం, రిజిస్టర్ల నిర్వహణలో లోపాలు ఉండడంతో దుకాణంపై 6ఏ కేసు నమోదు చేశారు. దుకాణంలో ఉన్న రూ.43,663 విలువైన ఎరువులను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో సీఐ సింహాచలం, ఏవో శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

ఉద్యోగుల సేవలు అభినందనీయం

విజయనగరం క్రైం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసుశాఖలో సుదీర్ఘంగా శాంతి భద్రతల పరిరక్షణలో సేవలు అందించి పదవీ విరమణ పొందిన సిబ్బంది సేవలు అభినందనీయమని ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. సుదీర్ఘ కాలం పోలీసుశాఖలో ఎంతో క్రమశిక్షణతో విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ చేసిన హోంగార్డులు కె.సూర్యనారాయణ, ఎం.వెంకట రామకృష్ణారావులను జిల్లా పోలీసు శాఖ తరుపున ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం స్థానిక పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించి ఆత్మీయ వీడ్కోలు పలికారు. వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌమ్యలత, ఆర్ఐ రమేష్ కుమార్, హెచ్‌సీ రాజు, హోంగార్డు కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

డెంకాడ, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు, బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనపై ప్రభుత్వ శాఖాధికారుల సమన్వయంతో అవగాహన కల్పిస్తున్నామని జిల్లా సివిల్ న్యాయాధికారి ఎ.కృష్ణప్రసాద్ తెలిపారు. మంగళవారం పెదతాడు గ్రామంలో యూత్ క్లబ్ బ్రిడ్జిపురం ఎన్జీవో జిల్లా సమన్వయకర్త జి.ఝాన్సీరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్మిక శాఖాధికారి శ్రీనివాసరావు, స్త్రీశిశు సంక్షేమశాఖ మిషన్ కోఆర్డినేటర్ సుజాత, వన్‌స్టాప్ సెంటర్ విజయసాయికుమారి, డీసీపీయూ యూనిట్ చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. పిల్లలకు, మహిళలకు ఉన్న పథకాలు, సేవలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డెంకాడ ఎస్ఐ సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

విజయనగరం క్రైం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని టూటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో గల తూర్పు బలిజ వీధిలో పేకాట శిబిరంపై టూటౌన్ పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.4,416 తోపాటు 3 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నట్లు టూటౌన్ ఎస్ఐ కనకరాజు తెలిపారు.

ఆ కోళ్లకు ఏమైంది?

(ఐదో పేజీ తరువాయి)

ఫారమ్స్ పేరుతో 13 రేకుల షెడ్లలో సుమారు 40 వేల వరకు నాటు కోళ్లను పెంచుతున్నాడు. వీటిలో అంతు చిక్కనివ్యాధితో సోమ, మంగళవారాల్లో 38 వేల వరకు మృత్యువాత పడ్డాయి. మిగిలిన కోళ్లు కూడా బుధవారం నాటికి చనిపోయేలా కనిపిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. నాటు కోళ్లకు చిన్న చిన్న అంటువ్యాధులు వచ్చినా తట్టుకుంటాయని, ఆ కారణంగానే హేచరీస్‌తో ఒప్పందం చేసుకోకుండా ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా వరకు మార్కెటింగ్ చేసుకుంటున్నానన్నాడు. సుమారు 180 రోజుల పాటు నాటు కోళ్లను పెంచి మార్కెట్ చేస్తుంటానని, మార్కెట్‌కు తరలించే సమయానికి ఈ వ్యాధి రావడంతో రెండు రోజుల్లో 38 వేల కోళ్లు చనిపోయాయన్నారు. ఎలా బయటపడాలో అర్థం కావడంలేదని వాపోయాడు.

నెలలో ఎప్పుడైనా తీసుకోవచ్చు

(ఐదో పేజీ తరువాయి)

తర్వాత తీసుకునే అవకాశం లేక.. ఆ నెల సరుకులు కోల్పోయే పరిస్థితి వస్తోంది. ఇక నుంచి నెలలో ఎప్పుడైనా రేషన్ తీసుకోవచ్చు. ఇదిలా ఉండగా వచ్చే నెల నుంచి రాగులతో పాటు గోధుమ పిండిని కూడా సబ్సిడీపై ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

మార్కెట్ ధర కంటే తక్కువకు..

రేషన్ దుకాణాలను నెలంతా తెరచి ఉంచటం ద్వారా ప్రభుత్వం డీలర్ల ఆదాయం పెంచే ఆలోచన కూడా చేస్తోంది. ఇందుకోసం పెద్ద కంపెనీలతో ఒప్పందాలు చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. నేరుగా కంపెనీల నుంచి సరుకులు కొనుగోలు చేసి, మార్కెట్ ధర కంటే తక్కువకు వినియోగదారులకు అందేలా చూడాలని భావిస్తోంది. గిరిజన ప్రాంతాల నుంచి ఆయా సంస్థలు, సహకార సంఘాల ద్వారా ఆర్గానిక్ సరుకులను కూడా రేషన్ దుకాణాల్లో అందుబాటులోకి తేవాలనుకుంటోంది. ఇదే సమయంలో రేషన్ విషయంలో సమస్యలు, సందేహాలుంటే 1967 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్‌చేసి సహాయం పొందవచ్చు.

● గత ప్రభుత్వం రేషన్ డిపోలను విలేజ్ మాల్స్‌గా తీర్చిదిద్దుతామని ఆర్భాటంగా ప్రకటించింది. ఆ తర్వాత విస్మరించింది. గతంలో రేషన్‌డిపోల్లో బియ్యం, పంచదారతో పాటు పామాయిల్, కందిపప్పు, గోధుమలు వంటివి సరఫరా చేసేవారు. ఇప్పుడు బియ్యం, పంచదారకు మాత్రమే పరిమితమైపోయింది. సుమారు 8 నెలల నుంచి కందిపప్పు సరఫరాను పూర్తిగా నిలిపివేశారు.దీంతో రేషన్‌కార్డుదారులు మార్కెట్‌లో అధిక ధరకు కందిపప్పు కొనుగోలు చేసుకోలేక అవస్థలు పడుతున్నారు. త్వరలో మళ్లీ అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

● రేషన్ డిపోలను నెలంతా తెరిచి ఉంచుతూ వాటిల్లో ఆర్గానిక్ వస్తువులు, పప్పుధాన్యాలు, వంట నూనె, గోధుమపిండి వంటివి పంపిణీ చేయాలనుకుంటోంది. ప్రస్తుతం బియ్యంతో పాటు అరకిలో పంచదారను రూ.17 చొప్పున విక్రయిస్తున్నారు. అంత్యోదయ కార్డులున్న వారికి 35 కిలోల బియ్యంతో పాటు కిలో పంచదారను కేవలం రూ.13.50 మాత్రమే విక్రయిస్తున్నారు. నెలంతా రేషన్ డిపోను కొనసాగించి అన్ని రకాల సరకులను అందుబాటులోకి తెస్తే అటు డీలర్లకు, ఇటు రేషన్ కార్డుదారులకు ప్రయోజనకరంగా ఉంటుంది.

మంచి నిర్ణయం

రేషన్ డిపోలను నెలంతా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించడం చాలా మంచిది. నిత్యావసర సరుకులను రేషన్‌డిపోల్లో అందజేస్తే పేద, మధ్యతరగతివర్గాల వారికి చాలా లాభసాటిగా ఉంటుంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రేషన్ సరఫరా వ్యవస్థను సరిచేసి ఒక గాడిలో పెడుతోంది. వంటనూనె, కందిపప్పు, గోధుమపిండి, పంచదార వంటివి సరఫరా చేస్తే ధరల భారం నుంచి పేదలకు ఉపశమనం కలుగుతుంది.

- చీమల రాంబాబు, దివ్యాంగుల సంఘం ప్రతినిధి, ఇందిరమ్మకాలనీ, బొబ్బిలి

బకాయిలపైనే దృష్టి

(ఐదో పేజీ తరువాయి)

అనుయాయులు ఉండడంతో ఇన్నాళ్లూ బ్యాంకు అధికారులు కూడా మిన్నకుండిపోయారు. అయితే బకాయిదా రులు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తే లేదని డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున హెచ్చరించడంతో బ్యాంకు అధికారులు రంగంలోకి దిగారు. పారుబాకీల జాబితాలో ఉన్నవారిని గుర్తించి వారి ఆస్తులను స్వాధీనం చేసేందుకు వీలుగా జప్తు నోటీసులను జారీ చేశారు. న్యాయపరమైన చర్యలకు కూడా ఉపక్రమించారు. ఇప్పటికీ బకాయిలను చెల్లించేందుకు ముందుకురాకుంటే వారి భూములను వేలం వేసేందుకూ నిర్ణయించారు. దీనిలో భాగంగా ఆయా గ్రామాల్లో దండోరా వేయించి ప్రభుత్వ కార్యాలయాల్లోని నోటీసు బోర్డుల్లో బకాయిదారుల జాబితా అంటిస్తారు. ఈ ప్రక్రియ శరవేగంగా చేపట్టేందుకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అరసాడ శ్రీనివాసనాయుడు, పిల్లా రామ్మోహన్ నేతృత్వంలో రెండు ప్రత్యేక బృందాలను నియమించారు. ఈ బృందంలో సభ్యులుగా ఎం.సంతోష్‌కుమార్, బి.సంహగిరి ఉన్నారు.

● నెల్లిమర్ల బ్యాంచి పరిధిలో 64 మంది రూ.ఆరు కోట్లు, గజపతినగరం బ్యాంచి పరిధిలో 116 మంది రూ.పది కోట్లు, పూసపాటిరేగ బ్రాంచి పరిధిలో 93 మంది రూ.8.50 కోట్లు, గరివిడి బ్రాంచి పరిధిలో 34 మంది రూ.3.12కోట్లు, సీతానగరం బ్రాంచి పరిధిలో 9 మంది రూ.42లక్షల పారు బాకీలు చెల్లించాల్సి ఉంది. అలాగే తెర్లాం బ్రాంచిలో 127 మంది రూ.8.50 కోట్లు, గుర్ల బ్రాంచిలో 145 మంది రూ.11 కోట్లు, సాలూరు బ్రాంచి పరిధిలో 89 మంది రూ.7.50 కోట్లు బకాయిలను చెల్లించాల్సి ఉంది.

కీలక శాఖలు ఖాళీ

(ఐదో పేజీ తరువాయి)

చూస్తున్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారిగా పనిచేసిన మధుసూధనరావు గత నెలలో ఉద్యోగ విరమణ చేశారు. అప్పటి నుంచి కొత్తగా డీఎస్‌వోను నియమించలేదు. ఏఎస్‌వో మురళీధర్‌కు ఇన్‌చార్జి డీఎస్‌వోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. వాస్తవానికి కూటమి ప్రభుత్వం సివిల్ సప్లయ్ వ్యవస్థను ప్రక్షాళన చేస్తోంది. అందులో భాగంగా నూతనంగా రేషన్ కార్డుల పంపిణీ, నెల రోజులూ నిత్యావసరాల పంపిణీ, కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవడం వంటి ప్రక్రియ జరుగుతోంది. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా పర్యవేక్షించే బాధ్యత జిల్లా అధికారిపై ఉంటుంది. ఇటువంటి కీలక పోస్టు ఖాళీ ఉంది.

● జిల్లా పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టరుగా పనిచేసిన వైవీ రమణ గత నెలలో ఉద్యోగ విరమణ చేశారు. దీంతో అక్కడ పనిచేసిన డిప్యూటీ డైరెక్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

● ఉద్యాన శాఖలో డీడీగా పనిచేసిన జమదగ్ని రెండు నెలల క్రితం బదిలీపై రాష్ట్ర కార్యాలయానికి వెళ్లారు. దీంతో హెచ్‌వోగా ఉన్న చంద్రశేఖర్ ఏడీగా పదోన్నతి ఇస్తూ డీడీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

● రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్, ఆర్‌డీవో పోస్టులు కూడా ఇన్‌చార్జిలతో సాగుతున్నాయి. యూనిట్-2 లో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేసిన నవరమ్మ గత నెలలో ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఆ పోస్టులో మరొక డిప్యూటీ కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. చీపురుపల్లి ఆర్‌డీవో అనారోగ్యం కారణంగా సెలవు పెట్టడంతో దివ్యాంగుల శాఖ ఏడీ ఆశయ్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

కీలక పోస్టులు ఖాళీగా ఉండటంతో అదనపు బాధ్యతలు నిర్వహించే అధికారులు ఇబ్బంది పడాల్సి వస్తోంది. గ్రామస్థాయిలో సిబ్బంది కొరత పెద్దగా లేకపోయినా జిల్లా కేంద్రానికి వచ్చే సరికి అధికారుల కొరత ఉండడం గమనార్హం. దీనివల్ల కిందిస్థాయి సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడుతోంది. జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సమస్యలపై పోరాటానికి సిద్ధంకండి

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పోరాటానికి అందరూ సిద్ధం కావాలని పార్వతీపురం జిల్లా కార్యదర్శి కోరంగి మన్మథరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక వైటీసీ బిల్డింగ్ ఆవరణలో నిర్వహించిన సీపీఐ సమావేశానికి పువ్వల ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మన్మథరావు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో సమస్యలను గుర్తించామన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే జగదీశ్వరికి వివరించామన్నారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు ఈ.వి.నాయుడు, బి.అప్పల నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా పవన్ కల్యాణ్ జన్మదిన వేడుకలు




బొబ్బిలి కోటలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన.. రక్తదాన శిబిరంలో జనసేన ఇన్‌చార్జి గిరడ

బొబ్బిలి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలను మంగళవారం బొబ్బిలి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. తొలుత అంజనేయస్వామి ఆలయంలో పవన్‌కల్యాణ్ పేరిట ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్‌కట్ చేశారు. పార్టీ సీనియర్ నాయకుడు పెద్దింటి మనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రిలో వైద్యాధికారి డాక్టర్ గేదెల శశిభూషణరావు చేతుల మీదుగా రోగులకు పళ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఇందిరమ్మ కాలనీలో పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నామినేటెడ్ పదువులు పొందిన 11 మంది జనసేన నాయకులను సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు, ఏఎంసీ డైరెక్టర్ లంక రమేష్, పొట్నూరు జనార్దన్, అడబాల నాగు, జన సైనికులు, వీరమహిళలు పాల్గొన్నారు.

బొబ్బిలి కోటలో...

బొబ్బిలి కోటలో మంగళవారం మల్లమ్మపేట జనసైనికుల ఆధ్వర్యంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే బేబీనాయన కేక్‌కట్ చేసి అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం మల్లమ్మపేట అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు పుస్తకాలు, పెన్సిళ్లు, చాక్లెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీను, దేవ్, సతీష్, లచ్చకోటి, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలు ఇవ్వండి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు శ్రీను

రామభద్రపురం, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): కారేడువలస, కాకర్లవలస గిరిజనులు సాగు చేస్తున్న భూములకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చేవరకు ఆందోళన చేపడతామని సీపీఎం నాయకుడు బలసా శ్రీను తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నో ఏళ్ల నుంచి సాగుచేస్తున్న భూములను ఎంఎస్‌ఎంఈ పార్కుకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే గిరిజనుల భూముల్లో పొక్లెయిన్లతో దున్నించడం ఎంతవరకు సబబని నిలదీశారు. దీనిపై రెవెన్యూ అధికారులు, ఏపీఐఐసీ అధికారులు ఎన్ని అడ్డంకులు కల్పించినా భూములు వదులుకునే ప్రసక్తిలేదని తేల్చి చెప్పారు. ఇప్పటికే గిరిజనులపై కేసులు బనాయించడం దుర్మార చర్య అని ఆక్షేపించారు. దీనిపై జిల్లా మంత్రులు ఇప్పటివరకు స్పందించకపోవడం దారుణమన్నారు. సమావేశంలో కారేడువలస, కాకర్లవలస గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

ఘనంగా గణేశ నిమజ్జనం



కోరాడవీధి గణేశుడి ఊరేగింపు

బొబ్బిలి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోరాడవీధిఓ ఏర్పాటైన మండలంలోని గణేశుడికి మంగళవారం నిమజ్జనోత్సవం ఘనంగా నిర్వహించారు. మేళతాళాలతో భారీ ఊరేగింపు చేపట్టారు. యువతీ యువకులు సందడి చేశారు. నిమజ్జనం చేశారు. బాలికల కోలాటం, ఇతర జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇదిలా ఉండగా చీపురుపల్లివీధి జంక్షన్‌లో హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు పువ్వల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దశావతారాల వినాయకుని మండపంలో ప్రతీ రోజూ కుంకుమపూజలు, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆర్టీసీ సేవలను పునరుద్ధరించండి



వినతిపత్రం అందజేస్తున్న భూదేవి

సీతంపేట రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): పూతికవలస, శంభాం, కోతాం, మానాపురం మీదుగా వీరఘట్టం వరకు ఆర్టీసీ బస్సు సేవలను పునరుద్ధరించాలని నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి కోరారు. మంగళవారం ఆమె.. ఏపీఎస్ ఆర్టీసీ ఉత్తరాంధ్ర జోనల్ ఛైర్మన్ దొన్నుదొరను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు సీతంపేట మన్యంలో మారుమూల ప్రాంతాలకు ఆర్టీసి సేవలు నిలుపుదల చేయడం వల్ల వృద్ధులు, వికలాంగులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై ఆర్టీసీ ఛైర్మన్ సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు.

ఆధునిక పద్ధతులతో సాగు సులభం

వీరఘట్టం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆధునిక పద్ధతులతో వ్యవసాయిన్ని సులభంగా చేయవచ్చునని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. రాష్ట్రీయ క్రిషి వికాస్ జోజనా పథకం కింద వ్యవసాయశాఖ, డీసీసీబీ 80 శాతం సబ్సిడీతో మంజూరైన వ్యవసాయ డ్రోన్‌లను మంగళవారం ఆయన వీరఘట్టంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో అధ్యక్షుడు కరణం చిన్నం నాయుడు, డ్రోన్ కమిటీ సభ్యుడు ఖండాపు హరి, ఏడీఏ రత్న కుమారి, మండల వ్యవసాయ అధికారి సౌజన్య, ఏఈవో రాజేష్, ఏపీవో రాము తదితరులు పాల్గొన్నారు.

పోరండంగూడ రోడ్డును బాగుచేయండి



అధ్వానంగా పోరండంగూడ రోడ్డు

కురుపాం, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): పోరండంగూడ రోడ్డు బురదమయం కావడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని గిరిజన సంఘం జిల్లా కమిటీ నాయుకుడు మండంగి ఇండియా కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మొండెంఖల్ నుంచి జోడుమానుగూడ వరకు రోడ్డు అధ్వానంగా ఉండటతో సుమార్ ఇప్పలగుడ్డి, ఈతమానుగూడ, బొత్తిలి, తొస్తంగి, నేరడుమానుగూడ, సెంట్రగూడ, పోరండంగూడ తదితర గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురువుతాన్నారన్నారు. అంబులెన్స్ కూడా రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొందన్నారు.

ఘాతుకం!

(ఐదో పేజీ తరువాయి)

పక్కన శ్రీను పడి ఉండడాన్ని గమనించిన గ్రామస్థుడొకరు శ్రీను కోసం వెతుకుతున్న భార్య జ్యోతికి విషయం తెలియజేశాడు. హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లిన భార్య, ఇతర కుటుంబ సభ్యులు చేతనంగా ఉన్న శ్రీనును చూసి భోరున విలపించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు ఘటనా స్థలానికి చేరుకొని శ్రీనును స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యుడు ధ్రువీకరించారు. శ్రీను మెడపై పెద్ద కత్తిగాట్లు ఉన్నాయి. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. శ్రీనుకు ఐదుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఘటనపై సీఐ రమణ వివరణ కోరగా గ్రామస్థుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అత్త, తోటి కోడలు, మరిది కొడుకుతో పాటు గ్రామానికి చెందిన తమపై గిట్టనివారు కలిసి ఈ హత్య చేసినట్లు శ్రీను భార్య ఆరోపించారు.

రూ. 52 లక్షల పనుల రద్దు

బొబ్బిలి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అతిథిగృహం మరమ్మతులకు మంజూరైన రూ.52 లక్షల నిధులు రద్దయ్యాయని ఆర్అండ్‌బీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బీకేపీ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 30న 'ఆంధ్రజ్యోతి'లో 'ఇది అతిథి గృహమే' శీర్షికతో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించి లిఖితపూర్వకగా వివరణ ఇచ్చారు. అతిథి గృహం మరమ్మతు పనుల కోసం రూ. 52 లక్షలు మంజూరయ్యాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తరువాత 20 శాతం లోపు జరిగిన పనులన్నింటినీ రద్దు చేయాలని ప్రొసీడింగ్స్ వచ్చాయన్నారు. దీనితో ఆ పనులు రద్దయ్యాయని, కొత్తగా మరమ్మతు పనుల కోసం ప్రతిపాదనలు పంపిస్తామని ఏఈఈ రాజు వివరించారు.

గోవా గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే



గవర్నర్‌కు వన్యప్రాణుల చిత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గోవా గవర్నర్ హోదాలో తొలిసారి జిల్లాకు విచ్చేసిన పూసపాటి అశోక్ గజపతిరాజును మంగళవారం సాయంత్రం విజయనగరంలో ఆయన నివాసంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన మర్యాదపూర్వకంగా కలిశారు. వన్యప్రాణులకు బేబీనాయన స్వయంగా తీసిన ఫొటోలను గవర్నర్ అశోక్‌కు బహూకరించారు. బేబీనాయన అభిరుచిని మెచ్చుకుంటూ గవర్నర్ ఆయన భుజం తట్టి అభినందించారు.

కల్వర్టు పైనుంచి వేగవతి ప్రవాహం



పారాది కాజ్‌వేపై నిలిచిన వాహన రాకపోకలు

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా మండలంలోని పారాది వద్ద వేగావతి నదిపై ఏర్పాటు చేసిన కాజ్‌వేపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. సోమవారం రాత్రి వరద ఉధృతి పెరగడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు ట్రాఫిక్ జామ్ అయింది. విషయం తెలుసుకున్న పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు. బొబ్బిలి నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే భారీ వాహనాలను తాత్కాలికంగా బాడంగి వైపు మళ్లించారు.

నేడు గురజాడ గృహంలో శాంతి దీక్ష

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): గురజాడ ఇంటిని ఆధునికీకరించాలని కోరుతూ జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ బుధవారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటలు వరకూ శాంతి దీక్ష నిర్వహించనున్నారు. గురజాడ సాహిత్యాన్ని డిజిటలైజ్ చేయాలని, గురజాడ జయంతిని రాష్ట్ర పండగగా చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఈ దీక్ష నిర్వహిస్తున్నట్టు బాబ్జీ మంగళవార ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వైఎస్సార్‌కు నివాళి

చీపురుపల్లి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా మంగళవారం చీపురుపల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పవిత్రోత్సవాలకు అశోక్‌కు ఆహ్వానం

నెల్లిమర్ల, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం రామతీర్థం దేవస్థానంలో ఈనెల 16 నుంచి నాలుగు రోజులపాటు జరుగనున్న పవిత్రోత్సవాలకు, అలాగే 24 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు జరుగనున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని కోరుతూ ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజుకు మంగళవారం ఆహ్వాన పత్రికలను అందజేశామని దేవస్థానం కార్యనిర్వహణాధికారి వై.శ్రీనివాసరావు తెలిపారు. ఈ విషయాన్ని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

యూరియా కోసం అగచాట్లు

లక్కవరపుకోట, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కొరతతో రైతులు నానా అగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు దుకాణాల్లో కనీసం ఒక బస్తా కూడా దొరకని పరిస్థితి ఏర్పడింది. నాట్లు వేసి సుమారు 2 నెలలు కావస్తున్నా అవసరమైన యూరియా దొరకలేదని, సమయం మించిన తర్వాత వచ్చినా లాభం లేదని రైతులు మండిపడుతున్నారు. కనీసం ప్రైవేటున కొందామన్నా దొరకలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ● యూరియా కొరతపై మండల వ్యవసాయ అధికారి హరికృష్ణను వివరణ కోరగా.. ఎప్పుడు వస్తుందో స్పష్టమైన తేదీ చెప్పలేకపోతున్నామని తెలిపారు. రైతులు నానో యూరియాను వినియోగించాలని కోరారు.

స్వీయరక్షణపై బాలికలకు అవగాహన

రామభద్రపురం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు స్వీయరక్షణపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ వెలమల ప్రసాదరావు సూచించారు. మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థినులకు సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన కల్పించారు. ప్రతీ పాఠశాలలో ఐదుగురు యాక్టివ్ విద్యార్థినులను శక్తి వారియర్స్‌గా గుర్తించి వారికి వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నామన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ర్యాగింగ్ ఈవ్‌టీజింగ్ నిరోధించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వంగపండు, పీడీ బెవర రామారావు, ఆరికతోట హైస్కూల్ పీడీ బొత్స రత్నకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్లతో పిచికారీ మేలు

రామభద్రపురం, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ ద్వారా నానో యూరియా పిచికారీ చేయడం వల్ల రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారి అమర శివ తెలిపారు. తారాపురంలో మంగళవారం రైతు బెవర సన్యాసిరావు డ్రోన్ ద్వారా పిచికారీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాకు బదులుగా 500 ఎంఎల్ నానో యూరియా పిచికారీ చేయడంవల్ల మొక్కకు నేరుగా నత్రజని అందుతుందన్నారు. గుళికల యూరియా మొక్కలకు వెళ్లకుండా భూమిద్వారా వెళ్లడం వల్ల వృథా అవుతుందన్నారు. దీనిపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో పి.వెంకటరమణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది బి.మాధురి పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు రండి

బొబ్బిలి, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 16 నెలల కాలంలో జరిగిన అభివృద్ధిపై స్థానిక ఎమ్మెల్యే బేబీనాయన బహిరంగ చర్చకు రావాలని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సవాల్ విసిరారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలను ప్రస్తావిస్తే ఎమ్మెల్యే తనపై ఆవేశంతో రగిలిపోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఓటమి కారణంగా తాను విమర్శలు చేస్తున్నానని అనడం సరికాదన్నారు. నాకు గెలుపు ఓటములు కొత్తేమీ కాదన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో భూ కబ్జాలు జరుగుతుంటే ఎమ్మెల్యే చోద్యం చూస్తున్నారని విమర్శించారు. సమావేశం లో వైసీపీ నాయకులు సావు మురళీకృష్ణారావు, చోడిగంజి రమేష్‌నాయుడు, తూముల భాస్కరరావు, ఇంటి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

స్పౌజ్ పింఛన్ల పంపిణీ

బాడంగి, సెప్టెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో స్పౌజ్ పింఛన్లను మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కండి రమేష్, ఎంపీటీసీ సభ్యుడు దేవరాపల్లి శ్రీనివాస్, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుణుపూరు అప్పలనర్సమ్మ, మాజీ సర్పంచ్ అంబటి తవిటినాయుడు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కోమటిపల్లిలో మహాన్నదానం

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోమటిపల్లిలోని పాత రామమందిరం వద్ద నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రెబల్ యూత్ నిర్వహిచిన కార్యక్రమంలో కోమటిపల్లి, చుట్టుప్రక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాలను స్వీకరించారు.

లాభసాటి సాగుకు సలహాలు

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపడుతున్నారు. విత్తనం నాటింది మొదలు పంట చేతికి వచ్చేవరకు అన్నదాతలకు వ్యవసాయాధికారులు సలహాలు ఇస్తున్నారు. మంగళవారం పెంట గ్రామంలో వో మజ్జి శ్యామ్‌సుందర్ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు ఎరువుల వాడకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. నానో యూరియా, నానో డీఏపీ ఆవశ్యకతను వివరించారు. వ్యవసాయ సహాయకురాలు వరలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

104, 108 సిబ్బందికి బియ్యం వితరణ

బొబ్బిలి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైఎస్ఆర్ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణానికి చెందిన రియాజ్ ఖాన్ మంగళవారం సేవా కార్యక్ర మాలు నిర్వహించారు. 104, 108 సిబ్బందికి బియ్యం ప్యాకెట్లను వితరణ చేశారు.

పౌష్టికాహారాన్ని వినియోగించుకోండి

గరివిడి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ గరివిడి పీవో ఎస్.ఆరుద్ర అన్నారు. మంగళవారం బొండపల్లి గ్రామంలో సూపర్‌వైజర్ జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన పౌష్టికాహార వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. అంగన్‌వాడీలు పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. గ్రామ పెద్దలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ పూర్తిచేయాలి

రాజాం, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం సకాలంలో పూర్తిచేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. బొద్దాం, గారాజుచీపురుపల్లి గ్రామాలలో స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ లబ్ధిదారులకు సకాలంలో స్మార్ట్ కార్డులు అందించకపోతే ఈనెల రేషన్ అందదని, అందుకు సకాలంలో అందజేయాలన్నారు.

మత సామరస్యంతో పండుగలు చేసుకోవాలి

గరివిడి, సెప్టెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజలందరూ మతసామరస్యాన్ని పాటించి పండుగలను నిర్వహించుకోవాలని తహసీల్దార్ చింతల బంగార్రాజు సూచించారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎస్ఐ లోకేశ్వరరావు సమక్షంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. రాబోయే ముస్లిం పండుగ, వినాయక నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా సమన్వయంతో నిర్వహించాలని అధికారులు కోరారు. వైస్ ఎంపీపీ ప్రతినిధి మీసాల విశ్వేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు సారిపాక సురేష్, ఆర్ఐ కంది అచ్యుతరావు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.